

వుదయం

www.voodayam.com

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ వెంకన్న

వరంగల్ సిటీ, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) :

గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు గ్రేటర్ వరంగల్ జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను కమిషనర్ టి. వెంకన్న బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సెంట్రల్ జోన్ డిసిపి ధారా కవిత, ఇతర అధికారులతో కలిసి నగర పరిధిలోని ప్రధాన నిమజ్జన కేంద్రాలైన పరికికుంట, కడిపికొండ, హసన్‌పర్తి, భీమారం, చిన్నవడ్డేపల్లి, కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, సిద్ధేశ్వర గుండం తదితర ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విగ్రహాల సంఖ్యకు అనుగుణంగా క్రేన్లు, బ్యారికేడింగ్, లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం జరిగే సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీలు, ప్రజల సహకారంతో నిమజ్జన ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ పరిశీలనలో అదనపు కమిషనర్ జోనా, బల్దియా ఎస్ఈ రాజ్‌కుమార్, పీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఏసీపీలు, ఈఈలు, ఇతర మున్సిపల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్ల అర్హుల గుర్తింపునకు క్షేత్రస్థాయి విచారణ

నందిగామ సర్పంచ్ భూక్యా భాస్కర్

నల్లబెల్లి, సెప్టెంబర్ 23 (వుదయం):

మండల పరిధిలోని నందిగామ గ్రామంలో బుధవారం రోజున చేయూత పింఛన్ల అర్హత నిర్ధారణకు క్షేత్రస్థాయి విచారణ కార్యక్రమాన్ని సర్పంచ్ భూక్యా భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్ రవికుమార్ నేతృత్వంలో అధికారుల బృందం ఈ విచారణను చేపట్టింది. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్లి పరిశీలన జరిపారు. దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లను, వారి సామాజిక, ఆర్థిక అర్హతలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో భాగంగా మొత్తం 35 మంది దరఖాస్తు దారుల వివరాలను సర్వే చేశారు. ఇందులో

వికలాంగులు 18, వితంతువులు 15, చేనేత కార్మికులు 1, ఒంటరి మహిళ 1 చొప్పున ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా భాస్కర్ మాట్లాడుతూ....

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే లక్ష్యమని తెలిపారు. పారదర్శకంగా సాగుతున్న ఈ విచారణ ద్వారా నిజమైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు అందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్, కారోబార్ రాజు, గూగులోతు రాజుతో పాటు పలువురు గ్రామస్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహా అన్నదానం ప్రారంభించిన ఎర్రబెల్లి

రాయపర్తి సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి):

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాయపర్తి మండలం బురాన్‌పల్లి గ్రామంలో మార్గదర్శి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, పాలకుర్తి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి, గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ, అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, రాయపర్తి మండల పార్టీ ముఖ్య నాయకులు, మార్గదర్శి యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చందు మల్లమ్మ చిత్రపటానికి పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి నివాళి

రాయపర్తి, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి):

రాయపర్తి మండల కేంద్రానికి చెందిన తన క్లాస్‌మేట్ చందు పర్వాతలు తల్లి చందు మల్లమ్మ ఇటీవల మృతి చెందడంతో, బుధవారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో ఎస్ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, మల్లమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్,

చందు రామ్, గజవెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్, చందు లక్ష్మణ్, తో పాటు స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బొజ్జ గణపయ్య విగ్రహాల నిమజ్జనం

తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు అందుకొని వాగుల్లో సరస్సులలో నిమజ్జనం.

స్థానిక ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు.

ఖానాపురం, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి):

మండలంలోని ఇరవై ఒక్క గ్రామ పంచాయతీల పరిధిలోని బొజ్జ గణపయ్య విగ్రహాల వద్ద ఆయా గ్రామాల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల అర్చక స్వాములు తొమ్మిది రోజులు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి తొమ్మిది రాత్రిలా అనంతరం బుధవారం సాయంత్రం నుంచి ఈ రాత్రి వరకు బొజ్జ గణపయ్యని ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఊరేగింపులు నిర్వహించుకుంటూ ప్రతి ఇంటి ముందు బొజ్జ గణపయ్య విగ్రహం వద్ద నీళ్లు ఆరబోసి కొబ్బరికాయ కొట్టి హారతి ఇచ్చి భక్తులు తమ మనసులో కోరికలను కోరుకొని బొజ్జ గణపయ్య స్వామికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని గ్రామదేవత సమీపంలోని ఎన్ హెచ్ 365 జాతీయ రహదారి ప్రక్కనే గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శ్రీ సీతా రామ చంద్ర స్వామి ఆలయ అర్చక స్వామి పర్వతపు శివప్రసాద్ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల గోత్రనామాలను చదివి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చివరి రోజున మంగళవారం రాత్రి వినాయక పూజ చేశారు. గణేష్ ఉత్సవాల నిమజ్జనం సందర్భంగా స్థానిక ఎస్సై జి రామ్మోహన్ ఆధ్వర్యంలో ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. ఎస్సై హామీ మేరకు ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ బాధ్యులు కార్యవర్గం వాడ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి, సెప్టెంబర్ 23 (వుదయం):

నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కల్యాణ లక్ష్మి పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా నల్లబెల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్, జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతిరెడ్డిల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు ఆర్థిక సహాయం పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థికంగా కొండంత అండగా నిలుస్తోందని అన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి తహసీల్దార్ ముప్పు కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, పాక్స్ డైరెక్టర్ చార్ల శివారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, వద్దూరి రమేష్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జన మార్గంలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

విద్యుత్ సరఫరా కొనసాగుతుండగానే పొలంలోకి ఒరిగిన లైటు..

పరకాల, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి):

పరకాల పట్టణంలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. నిమజ్జన మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైటు ప్రమాదకరంగా పొలంలోకి ఒరిగిపోయి, విద్యుత్ సరఫరా కొనసాగుతున్న సమయంలోనే వెలుగుతూ కనిపించడం ఆందోళనకు గురిచేస్తోంది.నిమజ్జన ఊరేగింపులో వినాయక విగ్రహాలతో పాటు భక్తులు, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఇలాంటి రద్దీ మార్గంలో విద్యుత్ లైటు ప్రమాదకరంగా ఒరిగి ఉండటాన్ని సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? విద్యుత్ స్తంభం లేదా లైటు అనుకోకుండా కూలినా, తీగలు తెగినా తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఒరిగిన లైటును వెంటనే తొలగించడంతో పాటు, విద్యుత్ సరఫరాను సురక్షితంగా నిలిపివేసి నిమజ్జన మార్గాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గణపతి నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

-జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) :

వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి తెలిపారు. బుధవారం హనుమకొండలోని బంధం చెరువు, సిద్ధేశ్వర గుండం వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బంధం చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు చెరువు, న్యూశాయంపేట కోట చెరువుల వద్ద విగ్రహాల ఎత్తు, నీటి లభ్యతకు అనుగుణంగా క్రేన్లు, లైటింగ్, బ్యారికేడింగ్, పారిశుద్ధ్య వసతులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిడబ్ల్యూఎంసి, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, ఫిషరీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు.నిమజ్జన ప్రదేశాల వద్ద రద్దీ, నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు మండపాల నిర్వాహకులు, భక్తులు వీలైనంత త్వరగా నిమజ్జన ప్రక్రియను ప్రారంభించి అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా పిన్నింటి అనిల్ రావు ప్రమాణ స్వీకారం

రైతుల సంక్షేమమే..

సొసైటీ అభివృద్ధి నా లక్ష్యం

పర్వతగిరి ,సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి):

వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం పర్వతగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ నూతన చైర్మన్‌గా పిన్నింటి అనిల్ రావు నూతన పాలకవర్గ సభ్యులు గా ఏలికట్టే వెంకటేశ్వర్లు, నరెడ్ల సూరయ్య,ముదురుకోళ్ల లక్ష్మి, ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, మోటపోతుల సుదర్శనం,నీలం శ్రీనివాస్,ఆబర్ల రవి,బొబ్బాల లింగారెడ్డి, బొట్ల మహేంద్ర,కత్తుల శ్రీనివాస్,దారవత్ సేత్ రామ్, గుగులోతు సుధాకర్లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈవో సీఎచ్. సురేష్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన ఛైర్‌పర్సన్ పిన్నింటి అనిల్‌రావు మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం రైతులకు,ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం ఒక గొప్ప బాధ్యత అని ఆయన అన్నారు.రైతుల సంక్షేమమే సొసైటీ అభివృద్ధి ప్రజల సమస్యల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు. పిఏసిఎస్ ద్వారా రైతులకు అందాల్సిన సేవలు మరింత పారదర్శకంగా సమర్థవంతంగా అందేలా కృషి చేస్తానని అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను విని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ,ఈ కార్యక్రమంలో సర్పంచులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సొసైటీ సిబ్బంది ం పాల్గొన్నారు.

రూ.45,116కు గణనాథుని లడ్డూ ప్రసాదం

మాటూరి రాజేందర్ దంపతులు కైవసం..

మమతా నగర్‌లో భక్తిశ్రద్ధలతో ముగిసిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు..

పరకాల, సెప్టెంబర్ 23 (వు దయం ప్రతినిధి):

పరకాల పట్టణంలోని మమతా నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు గణనాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు నిత్య అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడంతో కాలనీలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నరేన్ రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలం పాటలో శ్రీ మాటూరి రాజేందర్ దంపతులు రూ.45,116కు లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. స్వామివారి సన్నిధిలో తొమ్మిది రోజుల పాటు పూజలు, అభిషేకాలు అందుకున్న లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకోవడంతో భక్తుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా నరేన్ రాక్ స్టార్ యూత్ సభ్యులు మాట్లాడుతూ, మాటూరి రాజేందర్ దంపతులు లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకోవడం సంతోషంగా ఉందని, వారి కుటుంబ సభ్యులపై గణపతి స్వామి కటాక్షం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.తొమ్మిది రోజుల పాటు గణేష్ మండపం వద్ద నిర్వహించిన నిత్య అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తుల జయజయధ్వానాలు, యువత సందడి నడుమ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

RRGOUD A35
23 September 2026 15:36

పోషణ మాసం పై అవగాహన

-సమతుల్య ఆహారంతో ఆరోగ్యవంతమైన సమాజం.

-సర్పంచ్ తొర్రి పద్మ కుమార్ యాదవ్

పర్వతగిరి,సెప్టెంబర్22 (వుదయం ప్రతినిధి):

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సర్పంచ్ తొర్రి పద్మ కుమార్ యాదవ్,అంగన్వాడి టీచర్ అనిత అన్నారు. పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా మండలం ఏనుగల్లు గ్రామంలోని అంగన్వాడీ 3వ కేంద్రంలోబుధవారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, గుడ్లు తదితర వాటితో ప్రత్యేక ఆహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఏయే ఆహార పదార్థాల్లో ఎలాంటి విటమిన్లు, పోషకాలు ఉంటాయో వివరించారు.పిల్లలు, గర్భిణీలు, బాలింతలు మంచి పోషక విలువలు ఉండే సమతుల ఆహారం తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి, పిల్లల ఎదుగుదల గురించి, వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్వాడీ టీచర్లు వినోద,అరుణ గర్భిణీలు, పాల్గొన్నారు.

మూడుచెక్కలపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో ఆర్టీసీ డిఎం కు వినతిపత్రం

పాక్స్ చైర్మన్ రఘుపతి రావు

నల్లబెల్లి, సెప్టెంబర్ 23 (వుదయం):

మండల పరిధిలోని మూడుచెక్కలపల్లి గిరిజన గ్రామానికి నూతనంగా బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరుతూ బుధవారం నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ కు నల్లబెల్లి మండలం పాక్స్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతి రావు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు, మూడుచెక్కలపల్లి గిరిజన ప్రజల సుదీర్ఘ కోరికను పురస్కరించుకుని ఈ వినతిపత్రం అందించినట్లు తెలిపారు. రవాణా సౌకర్యాలు లేక నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు ఉపశమనం కలిగించేలా తక్షణమే నూతన బస్సు సర్వీసును నడిపించాలని ఆర్టీసీఅధికారులను కోరారు. కార్యక్రమంలో మూడుచెక్కలపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూక్య రమేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడుపరికిపవన్,మండల నేత భూక్యవెంకన్న, వార్డు మెంబర్ మసంపెల్లి అఖిల్ గ్రామ పార్టీ నేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం

తొమ్మిది రోజుల పూజలకు ఘన ముగింపు.. వీధుల్లో మార్మోగిన గణపతి నామస్మరణ.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 23.

వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడికి బుధవారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భారీ ఊరేగింపులతో గణపతి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఉదయం నుంచే గణేష్ మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి స్వామివారికి వీడ్కోలు పలికారు. అనంతరం డప్పులు, బ్యాండ్ మేళాలు, భక్తి గీతాల మధ్య గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి నామస్మరణతో పరిసరాలను మార్మోగించారు.'గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ విగ్రహాలను నిమజ్జన ప్రదేశాలకు తరలించారు. . ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచిన గణనాథుడి నిమజ్జనంతో వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు. భక్తుల హృదయాల్లో భక్తిభావాన్ని నింపిన గణపయ్యకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ వచ్చే ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది

హసన్ పర్తి సెప్టెంబర్23 (వుదయం ప్రతినిధి):

గ్రేటర్ వరంగల్ పరిధిలోని హసన్‌పర్తి 66వ డివిజన్ లో గోల్డెన్ స్టార్ యూత్, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. నిర్వహకులు తెలంగాణ రాష్ట్రంలో సమయానికి వర్షాలు కురవాలని కోరుకుంటూ భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

దాది బిక్షపతిసరోజన, దాది కుమార్‌కవిత, తోట కన్నయ్యసింధూజ దంపతులు, తోట నితిన్ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వహకులు ఉప్పల రవి, వడ్డేపల్లి శ్రీనివాస్, దాది రాజు, నాగరాజు, కామేశ్వర్ రెడ్డి, రాజేశ్వర్, వేణు, కర్ణాకర్, గరిగె శ్రీనివాస్, రాజు, కోటి, సంపత్, రాకేష్, రెబ్బ రమణ కుమార్, మహిళా భక్తురాలు రజినీ, కళ్యాణి, సమ్మక్క, పద్మ, సుజాత, మంజుల, సాంబలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ డాక్టర్ జి.ఎస్.కే. ధర్మారాజుకు ఘన సన్మానం

వరంగల్ టౌన్, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) :

Dr. GSK DHARMA RAJ
MEDICAL SUPERINTENDENT

జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.ఎస్.కే. ధర్మారాజును పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ధర్మారాజు మాట్లాడుతూ... మానవాళి ఆరోగ్య రక్షణలో ఆయుర్వేద వైద్యం అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. సాంప్రదాయ వైద్య పద్ధతులపై మరింత శాస్త్రీయ పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్న ఆయన, సమగ్ర ఆరోగ్య సంరక్షణను సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సి.కే.ఎం హాస్పిటల్ జనౌషధి కేంద్ర మెడికల్ షాప్ యజమాని 'దళిత రత్న' పోలేపాక యాదగిరి ప్రసాద్, డాక్టర్ రవి పాలి క్లినిక్ మేనేజ్‌మెంట్ జె.ఐ. ప్రభాకర్, వెటర్నరీ డాక్టర్ 'దళిత రత్న' జి. కుమారస్వామి, గాలి సదానందం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. ఈశ్వర్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి విస్తృత వైద్య సేవలు: డిఎంహెచ్ఓ

ఉర్సుగుట్ట, వడ్డేపల్లి చెరువుల వద్ద ఫస్ట్ ఎయిడ్ క్యాంపులను పరిశీలించిన డాక్టర్ బి. రాజారెడ్డి

వరంగల్ టౌన్, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) :

గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఉర్సు గుట్టలోని బేబీ పాండ్, రంగశాయిపేట యుపిహెచ్‌సి పరిధిలోని బెస్తం చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు మరియు దేశాయిపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ క్యాంపులను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిమజ్జనం జరిగే అన్ని ప్రధాన చెరువులు, ఘాట్ల వద్ద వైద్య శిబిరాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. క్యాంపుల్లో తగినన్ని ప్రాణరక్షణ మందులు, ప్రథమ చికిత్స సామగ్రి, అంబులెన్స్ సేవలతో పాటు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. భక్తులు ఎలాంటి

అత్యవసర ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే సమీపంలోని ఫస్ట్ ఎయిడ్ క్యాంపులను సంప్రదించి సేవలను వినియోగించుకోవాలని కోరారు.

డిసివో నీరజను కలిసిన అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి

సొసైటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం: డిసివో హామీ

చెన్నారావుపేట సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి)

జిల్లా సహకార అధికారి (డిసివో) నీరజను అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సొసైటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై డిసివోతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సొసైటీ పురోగతికి ఉన్న అవకాశాలను, పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలను డిసివో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై డిసివో నీరజ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని, సొసైటీ అభివృద్ధికి శాఖ పరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్ సిద్దన రమేష్, డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, సర్పంచ్ దార రంజిత్, ఉపసర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు

పాపయ్యపేట గౌడ సంఘం అధ్యక్షుడిగా బుడిగే నరేందర్ గౌడ్

నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

చెన్నారావుపేట సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) :

పల్లె సతీష్ బాబు గౌడ్
ప్రధాన కార్యదర్శి

అధ్యక్షుడు బుడిగే
నరేందర్ గౌడ్

మండల కేంద్రంలోని పాపయ్యపేట గ్రామంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా బుడిగే నరేందర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షుడిగా రామగోని రవి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పల్లె సతీష్ బాబు గౌడ్,కోశాధికారిగా కత్తి అనిల్ గౌడ్, సహాయ కార్యదర్శిగా మదూరి బుచ్చిరాములు గౌడ్,గౌరవ సలహాదారులుగా మేడి సాయిలు గౌడ్, కత్తి ఐలుమల్లు గౌడ్,కమిటీ సభ్యులుగా ఆకుల భరత్ గౌడ్, పల్లె రమాకాంత్ గౌడ్, రామగోని అశోక్ గౌడ్, మేడి రాజు గౌడ్, గోపగాని నర్సయ్య గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బుడిగే నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన గౌడ బంధువులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కుల సంక్షేమానికి, గౌడ సంఘ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుల పెద్ద మనిషి మేడి ప్రభాకర్ గౌడ్, సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్, నాయకులు మేడి సుధాకర్ గౌడ్, బుడిగే వెంకటేశ్వర్లు గౌడ్, తాళ్ళ సమ్మయ్య గౌడ్, పల్లె వెంకన్న గౌడ్, బుడిగే సూరయ్య గౌడ్, రాజు, గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

బాధితుడికి మొబైల్ అందజేత

రాయపర్తి సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి) :

మిస్సింగ్ అయిన మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ (CEIR) సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మిస్సింగ్ అయిన మొబైల్ ఫోన్ ఆచూకీని గుర్తించారు.అనంతరం ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడు బానోతు తార్యకు అప్పగించారు.ఈ సందర్భంగా ఎస్సై ముత్యం రాజేందర్ మాట్లాడుతూ ప్రజలు తమ మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. ఫోన్ పోయినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు, అవసరమైన వివరాలతో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మిస్సింగ్ ఫోన్‌ను గుర్తించి తిరిగి అందజేయడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధల నడుమ గణనాథుడి నిమజ్జనం డిసిపి రాజు మహేందర్ నాయక్

రాయపర్తి, సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి):

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బ్లూమింగ్ బడ్స్ పాఠశాల వారు నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీసీపీ రాజ్ మహేందర్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని దర్శించుకుని, అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు.నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను డీసీపీ పరిశీలించారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఏసిపి నరసయ్య , సర్పంచ్ గారే మహేంద్ర బిక్షపతి , ఎస్సై ముత్యం రాజేందర్, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ నాయక్, పాఠశాల ప్రిన్సిపల్ ఎనగందుల సంతోష్ కుమార్ , ఉపాధ్యాయులు అధికారులు, సిబ్బంది, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 23:

నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నర్సంపేట మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన గాలి శోభ కుమార్తె వివాహం జరగడంతో ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కును ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

146 మందికి చెక్కులు పంపిణీ
ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆర్డీవో ఉమారాణి,
నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 23.

నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట పట్టణం , నర్సంపేట మండలం, దుగ్గొండి , నల్లబెల్లి , ఖానాపూర్ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మొత్తం 146 మంది లబ్ధిదారులకు 1 కోటి 46 లక్షల రూపాయల విలువైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, మునిసిపల్ చైర్పర్సన్ పెండెం శ్రీ లక్ష్మి రామనంద్, మునిసిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మెన్లు బొబ్బల రమణా రెడ్డి , తోకల శ్రీనివాస్ రెడ్డి, చెన్నూరు కిరణ్ రెడ్డి, కంకల ప్రసాద్ , రఘుపతి రావు , వల్లే శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు , కౌన్సిలర్లు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్నహస్తం. మృతుని కుటుంబానికి రూ.5 వేల సాయం

మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసిన నాళ్లం విజయ్ కుమార్
నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 23

నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్‌కు చెందిన ములుగూరి యుగేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భర్తను కోల్పోయిన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న నాళ్లం విజయ్ కుమార్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి తనవంతు సహాయం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాళ్లం రవికిషన్, చేపూరి నాగరాజు, గోనెల కర్ణాకర్, విద్యమారి శ్రీను, ముత్యాల రమేష్, పొలబోయిన గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

ఈనెల 27న చలో భువనగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.
ఉద్యమకారుల జిల్లా, మండల అధ్యక్షులు.
ఖానాపురం, సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి):

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్, ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు వల్లెపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశంను ఉద్యమకారుల మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు పాల్గొని ఉద్యమకారుల సమస్యలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 27న భువనగిరి నిర్వహించే చలో భువనగిరి సమావేశంలో అధిక సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు.

అనంతరం చలో భువనగిరి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు రామ సహాయం ఉపేందర్ రెడ్డి, కందికట్ల జయ, భూస అశోక్, కోరే సుధాకర్, పోతురాజు కట్టయ్య, వీరమల్ల రాములు, జాటోత్ బాలు,.గణేష్, బుస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా ఎస్సీ సెల్ ఇంచార్జీగా పుల్ల దుర్గా రామ్

ములుగు, సెప్టెంబర్23
(వుదయం ప్రతినిధి):

ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పుల్ల దుర్గా రామ్ అన్నారు. ఎస్సీ సెల్ ములుగు జిల్లా ఇంచార్జీ గా పుల్ల దుర్గా రామ్ నియమితులయ్యారు. హసన్ పర్తి మండల కేంద్రానికి చెందిన పుల్ల దుర్గా రామ్ గత ముప్పై సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాడు.

నూతనంగా టీపీసీసీ ములుగు జిల్లా ఎస్సీ విభాగం ఇంచార్జీగా నియమితులైన పుల్ల దుర్గా రామ్ నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా పుల్ల దుర్గా రామ్ మాట్లాడుతూ... తన పై నమ్మకం ఉంచి టీపీసీసీ ములుగు జిల్లా ఎస్సీ విభాగం ఇంచార్జీగా నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఏఐసిసి ఎస్సీ విభాగం జాతీయ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షులు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ లకు పుల్ల దుర్గా రామ్ ధన్యవాదాలు తెలిపారు.

శివపుత్ర యూత్ అసోసియేషన్ వినాయక చవితి వేడుకల్లో చింతకుంట్ల మల్లిఖార్జున్ మహా అన్నదానం

ముఖ్య అతిథులుగా పాల్గొన్న నూతన పిఎసిఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు ఎస్ఐ. బి. ప్రవీణ్ కుమార్
పర్వతగిరి, సెప్టెంబర్23
(వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండల కేంద్రంలో శివపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్తులు గణనాథుడికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా గణేష్ మండపం ప్రాంగణంలో చింతకుంట్ల మల్లిఖార్జున్ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి పిఎసిఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు , ఎస్ఐ. బి. ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం వడ్డించి భక్తులను సంతోషపరిచారు.

202/ఏ భూములను అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమకారులకు పంచాలి

తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్.
నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 23.

202/ఏ భూములపై సమగ్ర న్యాయ విచారణ జరిపించి, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమకారులకు పంపిణీ చేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నర్సంపేట తెలంగాణ జన సమితి డివిజన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం రాజకీయాలకు అతీతంగా సాగిందని, స్వరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. ధరణి పేరుతో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని, అవసరమైతే సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం బాధాకరమన్నారు. 202/ఏ భూములపై సమగ్ర విచారణ అనంతరం అర్హులైన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు భూములు కేటాయించాలని కోరారు. ఎన్నికల సమయంలో తెలంగాణ జన సమితితో కలిసి పోటీ చేసిన సందర్భంగా కాంగ్రెస్ అధినేతగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలని అన్నారు. రెండు ఎమ్మెల్సీ పదవులు, ఐదు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, ఐదు జిల్లా స్థాయి చైర్మన్ పదవులపై ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీవో 95 కారణంగా పాలిటెక్నిక్ కళాశాలలను మూసివేయడం సరికాదని, వెంటనే జీవో 95ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ స్వీకరించిన సమాచారాన్ని ప్రభుత్వం పరిశీలించి నిజమైన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వారికి న్యాయం చేయాలని అంబటి శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, బోనగాని రవీందర్, మహమ్మద్ మెహబూబ్ అలీ, సాంబరాతి మల్లేశం, కాసాని పద్మ, రామగిరి మాధవి, అకారపు సరోజన, రాజు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ప్రదేశాల్లో డీసీపీ , డిపిఓ తనిఖీలు

రాయపర్తి–మైలారం రిజర్వాయర్లను పరిశీలించిన డీసీపీ రాజు మహేందర్ నాయక్, డిపిఓ కల్పన
రాయపర్తి సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి):

వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించనున్న నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు ను రాయపర్తి మండలంలోని నిమజ్జన ప్రదేశాలను డీసీపీ రాజు మహేందర్ నాయక్, డీపీఓ కల్పన పరిశీలించారు. రాయపర్తి, మైలారం ప్రాంతాల్లోని రిజర్వాయర్లు, చెరువుల వద్ద నిమజ్జనానికి అనుకూలమైన ప్రదేశాలు, భద్రతా పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.చెరువులు, రిజర్వాయర్ల వద్ద ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, నిమజ్జన సమయంలో పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, గజ ఈతగాళ్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.నిమజ్జన ప్రదేశాల్లో వెలుతురు, రాకపోకలు, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గణనాథుడి నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీసీపీ రాజు మహేందర్ నాయక్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి నర్సయ్య, సీఐ సంజీవరావు , ఎస్సై ముత్యం రాజేందర్,సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి, చిర్ర వేణు పంచాయతీ కార్యదర్శి గుగులోతు యాకూబ్ నాయక్ , విజేందర్ ,తదితరులు పాల్గొన్నారు.

చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా అత్తి కుమారస్వామి ప్రమాణ స్వీకారం

రైతుల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం
పర్వతగిరి ,సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి):

వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ నూతన చైర్మన్‌గా అత్తి కుమారస్వామి, నూతన పాలకవర్గ సభ్యులు నూతన పీఏసీ కమిటీ అత్తి కుమారస్వామి , మాసాని యాకూబ్, పల్లెపాటి రామచంద్రరావు, ఓరుగంటి శ్రీనివాస్, గడ్డం శంకరయ్య, ముక్కెర నర్సమ్మ, పెరుమాల దేవేందర్, లింగంపల్లి కుమార్, చౌద రాఘవులు, బానోతు రవి, కందుల లావణ్య, బేతన్ కుమార్ స్వామి, గరికపాటి రామారావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులు అందరు నూతన పీఐసీ కమిటీ చైర్మన్‌గా అత్తి కుమారస్వామి ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. సొసైటీ సీఈవో కె. ప్రదీప్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ అత్తి కుమారస్వామి మాట్లాడుతూ.. చౌటపల్లి సొసైటీ పిఐసి చైర్మన్ గా ఎన్నిక చేసినందుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. యూరియా, రుణాలు, సబ్సిడీ విత్తనాలు తదితర వ్యవసాయ అవసరాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పాలకవర్గంతో కలిసి కృషి చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంరక్ష హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ రాజారెడ్డి

వరంగల్ సిటీ, సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి) :

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డి ఎం హెచ్ ఓ) డాక్టర్ బి. రాజారెడ్డి బుధవారం పట్టణంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్2010, రూల్స్2022 అమలు తీరుతో పాటు పొల్యూషన్ కంట్రోల్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, STP, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ICU, డయాగ్నస్టిక్స్, జనరల్ వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, మేనేజ్‌మెంట్‌కు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు:

ఫీజుల నియంత్రణ: టారిఫ్ బోర్డులో ప్రదర్శించిన ధరల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని, అనవసర డయాగ్నస్టిక్ పరీక్షలు రాయకూడదని స్పష్టం చేశారు. స్పష్టమైన సమాచారం: హాస్పిటల్ సేవలు, ధరల పట్టిక, వైద్యుల వివరాలను రిసెప్షన్ వద్ద ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలి. PCPNDT చట్టం అమలు: స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ₹10,000 నుండి ₹50,000 వరకు జరిమానాతో పాటు 3 నుండి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష తప్పదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేట్ ఆసుపత్రులపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు పాల్గొన్నారు.

జిపిఓ నరసింహస్వామిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలి ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు

జిపిఓ నరసింహస్వామి

జిపిఓ లీలలు.. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ భూ ఆక్రమణలు,
కోర్టు వారెంట్!
విధులు మాదన్నపేటలో..
ఆగడాలు చెన్నారావుపేటలో!
రెండు క్రిమినల్ కేసులు నమోదైనా ఖాతరు చేయని అధికారి
కోర్టు ఆదేశాలతో ఎన్‌బిడబ్ల్యూ జారీ
నర్సంపేట కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు
చెన్నారావుపేట సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి) :

ప్రజలకు సేవ చేయాల్సిన ఒక ప్రభుత్వ అధికారి, తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూ ఆక్రమణలకు పాల్పడడమే కాకుండా, కోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేసిన ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. మాదన్నపేట గ్రామంలో జిపిఓ గా పనిచేస్తున్న చెన్నారావుపేట గ్రామానికి చెందిన చెలుకలపెల్లి నరసింహస్వామి అనే అధికారిపై శాఖాపరమైన తీవ్ర చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. అసలేం జరిగింది? చెన్నారావుపేట గ్రామానికి చెందిన బాధితుడు చెలుకలపెల్లి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండల పరిధిలోని తన సొంత వ్యవసాయ భూమిలోకి జిపిఓ నరసింహస్వామి అక్రమంగా ప్రవేశించి, ఆక్రమించుకోవడానికి యత్నించారని ఆరోపించారు. ఈ అక్రమాలపై చెన్నారావుపేట పోలీసు స్టేషన్‌లో ఐపిసి 447, 427 సెక్షన్ల కింద రెండు విడివిడి క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.క్రిమినల్ కేసులు నమోదైనప్పటికీ చట్టాన్ని గౌరవించకుండా, సదరు విఆర్వో కోర్టు విచారణకు హాజరుకాకుండా నిర్లక్ష్యం వహించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన నర్సంపేట అడిషనల్ జెఎఫ్‌సిఎమ్ న్యాయస్థానం ఆయనపై నాన్‌బెయిలబుల్ వారెంట్ (ఎన్ బిడబ్ల్యూ) జారీ చేసింది. ఈ వారెంట్ ఆధారంగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని 21.09.2026 నా కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన జిపిఓ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ, క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని కోర్టు వారెంట్లు ఎదుర్కొంటున్నాడని బాధితుడు వాపోయారు. సర్వీస్ ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించిన ఈ అధికారిపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత కోర్టు ఉత్తర్వులు, ఎఫ్ఐఆర్ కాపీలతో ఉన్నతాధికారులకు బాధితుడు రాజు ఫిర్యాదు చేశారు

ప్రజా సమస్యలు పట్టించుకునే అభ్యర్థికే మద్దతు

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధం
– రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కుందూరు గోపాల్ రెడ్డి
హనుమకొండ, సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి) :

రాబోయే మార్చి నెలలో జరగనున్న వరంగల్ ఖమ్మం నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎం.ఎల్.సి. (M.L.C.) ఎన్నికలలో పట్టభద్రులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు ఆలోచించి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే అభ్యర్థినే ఎన్నుకోవాలని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కుందూరు గోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం రోజున హనుమకొండ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుందూరు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని, ప్రజల సమస్యలను విస్మరించారని విమర్శించారు. ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 2 శాతం మాత్రమే ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై శ్రద్ధ చూపుతున్న పాలకులు, మిగిలిన 98 శాతం సాధారణ ప్రజల, పెన్షనర్ల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను గతంలో సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఆడిటర్‌గా పనిచేసి నలభై ఏళ్లకు పైగా ప్రజాసేవలో ఉన్న తనకు ప్రజల, పెన్షనర్ల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని గోపాల్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న అనుభవం తనకు ఉందని, రాజకీయ ప్రయోజనాలు కాకుండా కేవలం ప్రజాసేవే లక్ష్యంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పట్టభద్రులందరూ ఓటు హక్కును పొంది, విజ్ఞతతో ఆలోచించి ప్రజా సేవా దృక్పథం కలిగిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పెన్షనర్స్ అధ్యక్షులు కుందూరు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిండి కుమారస్వామి, వైస్ ప్రెసిడెంట్ పగడాల సరళ, కార్యదర్శి ఎల్లంభట్ల శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముదిగంటి వెంకటేశ్వర్లు, యూనిట్ అసోసియేట్ ప్రెసిడెంట్ గన్నోజు సదానంద చారి, జాయింట్ సెక్రటరీలు కుందూరు జగదీశ్వర్ రెడ్డి, నోముల ప్రభాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొండం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

జీపీఓ, గ్రామపంచాయతీ కార్యదర్శులు , సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.
జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన దేవి
పర్వతగిరి ,సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి):

నేడు సెప్టెంబర్ 24న నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి అన్ని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన దేవి తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్‌సత్యశారద ఐఏఎస్ ఆదేశాల మేరకు బుధవారం అన్నారం , వడ్లకొండ గ్రామాలలో నిమజ్జనానికి గుర్తించిన చెరువుల వద్ద ఏర్పాట్లను సంబంధిత మండల పంచాయతీ అధికారి శేషాంజన్ ,గ్రామపంచాయతీ జిపిఓ , కార్యదర్శులు తో కలిసి ఆమె పరిశీలించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు గ్రామ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా ఎంపీడీఓ , కు సమాచారం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన దేవి సూచించారు. పరిశీలనలో వడ్లకొండ సర్పంచ్ డెక్క సునీత కుమారస్వామి ,సంబంధిత అన్నారం జీపీఓ రాజు , పెద్దతండా కార్యదర్శి వెంకటరమణ,, వడ్లకొండ కార్యదర్శి వాణి , కారోబార్ సీ ఎచ్. రమేష్ ,గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు చివరి అవకాశం 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

PROF. MALLAM NAVEEN
M.A., B.Ed., Ph.D., PGDTE, SET
PRINCIPAL (E.C. MEMBER, KU)

నర్సంపేట వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 23:

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో 2026-27 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపారు. దోస్త్ నిబంధనల ప్రకారం 24, 25 తేదీల్లో ప్రవేశాలు కల్పించి, విద్యార్థుల వివరాలను 26న దోస్త్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఖాళీగా మిగిలిన సీట్లకు 28, 29 తేదీల్లో సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. స్పాట్ అడ్మిషన్లలో స్థానిక అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుందని, స్థానికులు అందుబాటులో లేని పక్షంలో నిబంధనల ప్రకారం ఇతర ప్రాంతాల అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఇప్పటివరకు డిగ్రీలో ప్రవేశం పొందని అర్హులైన ఇంటర్మీడియట్ ఉత్తీర్ణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ మెమోలు, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలతో పాటు ఒరిజినల్స్, జిరాక్స్ ప్రతులు తీసుకురావాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.425గా నిర్ణయించినట్లు, ఈ అడ్మిషన్లకు స్కాలర్‌షిప్‌కు అర్హత ఉండదని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

పోలకమ్మ చెరువు వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్..
పర్వతగిరి , సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి):

పర్వతగిరి పరిధిలోని పోలకమ్మ చెరువు వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించనున్న ప్రాంతాన్ని పర్వతగిరి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ కలిసి పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేశ్ విగ్రహాల ఊరేగింపులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, సంబంధిత సిబ్బందితో చర్చించారు. నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరిగేలా పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత గ్రామ జిపిఓ కార్యదర్శిఅధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో భక్తుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో విద్యు

తీర్మాలయపల్లి కేజీబీవీలో స్వచ్ఛతా సంకల్పం

రాయపర్తి సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి):

పరిశుభ్రత అనేది కేవలం కార్యక్రమం కాదు, ప్రతి ఒక్కరి జీవన సంస్కృతిగా మారాలని జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన స్పష్టం చేశారు. మార్పు ఎక్కడి నుంచో కాదు, పాఠశాల నుంచే మొదలవ్వాలని బలంగా ఉద్ఘాటించారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమంలో భాగంగా తీర్మాలయపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. పరిశుభ్రమైన వాతావరణంలోనే ఆరోగ్యకరమైన సమాజం వికసిస్తుందని పేర్కొన్నారు .చదువుతో పాటు పరిసరాల పరిశుభ్రతకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని హితవు పలికారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, తమ తరగతి గదులు, పాఠశాల ఆవరణ పరిశుభ్రతకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా తల్లిదండ్రులను, గ్రామస్థులను చైతన్యవంతం చేసే బాధ్యతను విద్యార్థినులే భుజాన వేసుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుతామని విద్యార్థినులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి బుర్ర కవిత, ఉపాధ్యాయ బృందం, స్థానిక సర్పంచ్ బరిగేల బాబు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి విక్రమ్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది, స్వీపర్లకు టీ-షర్టు పంపిణీ చేసిన చైర్మన్ సారంగపాణి

వర్ధన్నపేట సెప్టెంబర్ 23
(వుదయం ప్రతినిధి):

వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహిస్తున్న వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ సిబ్బంది, స్వీపర్లను వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అభినందించారు.వారి సేవలను ప్రోత్సహించే ఉద్దేశంతో టీషర్టను పంపిణీ చేశారు.కొనారెడ్డి చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమం సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పన, పరిసరాల పరిశుభ్రత, భద్రత తదితర విధుల్లో మున్సిపల్ సిబ్బంది నిరంతరం సేవలందిస్తున్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది, స్వీపర్లు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు . ఈ సందర్భంగా చైర్మన్ సారంగపాణి మాట్లాడుతూ.. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు, స్వీపర్లు అందిస్తున్న సేవలను అభినందించిన ఆయన.. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ సమష్టిగా పనిచేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, నాయకులు నేతావత్ రాజేందర్, తిరుపెల్లి కుమారస్వామి, అనిమిరెడ్డి రాంచంద్రారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు పాల్గొన్నారు.